క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని హనుమాన్‌పేట, ఈదులగూడం 11కేవీ ఫీడర్ల పరిధిలోని హనుమాన్‌పేట, రెడ్డికాలనీ, నాగార్జుననగర్, ముత్తిరెడ్డికుంట ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు.. షాబునగర్, గాంధీనగర్, హౌసింగ్‌బోర్డు, ఈదులగూడెం, ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వన్ టౌన్, టూ టౌన్ ట్రాన్స్‌కో ఏఈలు వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కాలనీలో చెట్ల కొమ్మలు తొలగించేందుకు గాను విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని కోరారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొండమల్లేపల్లి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కోరారు.

దరఖాస్తులకు ఆహ్వానం

దేవరకొండ : మండల పరిధిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు గాను ఏప్రిల్ 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు., దరఖాస్తు అనంతరం ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కొండమల్లేపల్లి : తెలంగాణ సాంఘిక సంక్షేమ, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు కొండమల్లేపల్లి ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమణమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి



బండ్లను వెనక్కి నెడుతున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలో ప్రధాన రోడ్డు వెంట డ్రెయినేజీ పనులు జరుగుతున్నందున ట్రాఫిక్ నియంత్రణకు తోపుడు బండ్ల వ్యాపారులు సహకరించాలని ట్రాఫిక్ ఎస్ఐ ఐ.మోహన్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని సాగర్‌రోడ్డులో రోడ్లపై ఉన్న తోపుడు బండ్లను రోడ్డుకు దూరంగా పెట్టించిన అనంతరం ఆయన మాట్లాడారు. తోపుడు బండ్లు పెట్టిన చోటునుంచి ముందుకు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట దహనం చేసిన వ్యక్తిపై కేసు

మిర్యాలగూడ టౌన్ : నందిపాడు గ్రామ శివారులో వరి పంటను దహనం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె. నరేశ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ బారెడ్డి, రైతు అశోక్‌రెడ్డికి చెందిన వరి పంట నందిపాడు గ్రామ శివారులో గల వరి పంటను సోమవారం తెల్లవారు ఝామున బరపటి మల్లయ్య అనే వ్యక్తి రెండు ప్రాంతాల్లో వరిని దహనం చేసినందుకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్లయ్యనాయక్‌ను కలిసిన నాయకులు



బెల్లయ్యనాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

పెద్దవూర : తెలంగాణ రాష్ట్ర గిరిజన డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్‌ను మంగళవారం లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ రమావత్ సక్రునాయక్, నాయకులు రమేష్‌నాయక్, సందీప్‌నాయక్, రాజేష్‌నాయక్, వెంకన్న పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

- మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్
- సిబ్బంది హాజరు పట్టిక పరిశీలన
- పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని సూపరింటెండెంట్‌కు ఆదేశం



మిర్యాలగూడ అర్బన్: ఏరియా ఆస్పత్రిలోని పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



ఏరియా ఆస్పత్రిలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

మిర్యాలగూడ అర్బన్ : ఆస్పత్రి వైద్యులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. ఈ నెల 22న జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన 'పేదలకు అందని ప్రభుత్వ వైద్యం' అదే విధంగా ఈ నెల 25న ప్రచురితమైన 'ఏరియా ఆస్పత్రిలో పారిశుద్ధ్య లోపం' అనే శీర్షికలతో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అదనపు కలెక్టర్ మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. వైద్యుల అటెండెన్స్ రిజిస్టర్ తెప్పించి చూసి హాజరుపట్టికను పరిశీలించారు. అందులో సంతకాలు పెట్టకుండా ప్రెజెంట్ అయినట్లు రాసుకోవడం సరికాదని అలా జరగకుండా చూసుకోవాలన్నారు. ఆస్పత్రిలోని వైద్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డులను పరిశీలించి ఆస్పత్రిలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్యులు తమ డ్యూటీ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. రానున్న వేసవి దృష్ట్యా అన్ని రకాల మందులనుందుబాటులోంచాలని, కుక్క కాటు వ్యాక్సిన్లు కొరత లేకుండా చూడాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరథ్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ యూసుఫ్, ఎఓ మోయిన్ ఖాన్, డిప్యూటీ డీహెంహెచ్ఓ రవి

అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మిర్యాలగూడ : అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర కోరారు. మంగళవారం స్థానిక రైతువేదికలో మిర్యాలగూడ నియోజకవర్గ స్థాయి విలేజ్ ఆర్గనైజేషన్ చైర్మన్లకు అమ్మ ఆదర్శ పాఠశాల అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ కార్యక్రమం ఉద్దేశించిందన్నారు. పాఠశాలలో సౌకర్యాలు కల్పించేందుకు పంచాయతీరాజ్ ఇంజనీర్లు ఆర్గనైజేషన్ చైర్మన్లు సమన్వయంతో పనులు గుర్తించాలని పనులను బట్టి రూ.5లక్షల నుంచి రూ.30లక్షల వరకు మంజూరు చేస్తారని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ, పి.కరుణాకర్‌రావు, జానయ్య, కృష్ణమూర్తి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎర్రబెల్లి జాతర



లింగమంతుడు, మాణిక్యాలదేవి వేషధారణలో భక్తులు

నిడమనూరు : నాలుగు రోజులు నుంచి జరుగుతన్న ఎర్రబెల్లి జాతర మంగళవారం సాయంత్రం మానిక్యాలదేవి గొర్రెల మంద ప్రవేశంతో ముగిసింది. జిల్లా నలు మూలల నుంచి భక్తులు వచ్చి సోమవారం, మంగళవారాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. లింగమంతుడు, మానిక్యాలదేవి వేషధారణలో ఉన్న ఇద్దరూ గుడిలో లింగమంతుల స్వామి, మాణిక్యాలదేవిలకు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. భక్తులు సైతం వేషధారణలో ఉన్న వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. యువకులు అంతా వారితో సెల్ఫీలు దిగి సంతోషాన్ని పంచుకున్నారు. ఈసంవత్సరం జాతరకు ముగింపు పలికి మళ్లీ 2026లో వచ్చే జాతరకు వస్తాం అంటూ భక్తులు తిరుగుప్రయాణం చేశారు. ఈ కార్యక్రమాల్లో పూజారులు నారాయణ వెంకటరమణ శర్మ, నారాయణ గోపీనాద్ శర్మ, ఆలయ చైర్మన్ మట్టయ్య, మన్నెం రంజిత్ యాదవ్, మెంబర్స్ మేకల శంకర్‌యాదవ్, బోడ యాదయ్య, పడగాల కమలమ్మ, పెద్దమాము రవి పాల్గొన్నారు.

ధర్మభిక్షం జీవితం ఆదర్శనీయం



దేవరకొండ : ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మిర్యాలగూడ అర్బన్: నివాళులర్పిస్తున్న గీతకార్మిక సంఘం నాయకులు

దేవరకొండ : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ కామ్రేడ్‌బొమ్మగాని ధర్మభిక్షం జీవితం ఆదర్శనీయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహ్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో బొమ్మగాని ధర్మభిక్షం 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె నర్సింహ,ఉప్పునూతల వెంకటయ్య, కుంభం జయరాములు, నూనె రామస్వామి, పల్లా రంగారెడ్డి, వలమల్ల ఆంజనేయులు, కిన్నెర యాదయ్య, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాటికోల్‌లో..

మండల పరిధిలోని తాటికోల్ గ్రామంలో తెలంగాణ గౌడ, గీత పనివరల సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్ 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ గౌడ, గీత పనివరల సంఘాల సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ ధర్మభిక్షం విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చలమల విజయ్, కాటం గౌడ్, రేణుగౌడ్, యలాలయ్య గౌడ్, వీరయ్యగౌడ్, ఆంజనేయులు గౌడ్, బాల చందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ధర్మభిక్షం సేవలు మరువలేనివి

మిర్యాలగూడ అర్బన్ : మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతిని మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో తాటి వనాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, గీత పనివరల సంఘం నాయకులు ఆర్. సైదులు, గీత కార్మిక సంఘం నాయకులు ఆకిటి రామస్వామి, బంటు వెంకటయ్య, గువ్వల రామలింగం, హనుమంతు, సైదులు, మోత్కూరు వెంకటయ్య, లక్ష్మయ్య, నక్క రాములు, దయాకర్, రాంబాబు, నగేష్ తదితరులున్నారు.

ఏబీసీడబ్ల్యూఓను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న కుర్ర సైదానాయక్

హాలియా : బీసీ సంక్షేమ హాస్టల్ వర్కర్ల విషయంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టి ఏబీసీడబ్ల్యూఓను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ సాగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా బీసీ సంక్షేమశాఖలో వర్కర్ల విషయంలో జరిగిన అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఏబీసీడబ్లూఓను సస్పెండ్ చేసి ఏజెన్సీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సంఘం నాయకులు నవీన్, సాయి, చందు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్ వర్కర్ల విషయంలో లక్షల రూపాల అవినీతికి పాల్పడిన ఏబీసీడబ్లూఓను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర సైదానాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు సాయం చేయాల్సిన బిసి వసతి గృహం జిల్లా అధికారులు 62 మందిని వర్కర్లు నియమించి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.55 వేలు వసూలు చేశారని ఆరోపించారు. ఇప్పటికైన కలెక్టర్ స్పందించి అవినీతికి పాల్పడిన అధికారినితోపాటు ఏజెన్సీ గోపాల్‌రెడ్డిపై కూడా క్రిమినల్ కేసు నమోదు చేయాలని, లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు జగన్, వదూద్, శివ, ముని తదితరులున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసు

నాగార్జునసాగర్ : మైనర్లు నడిపేందుకు వాహనాలిచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయనున్నట్లుగా విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్‌గౌడ్ పేర్కొన్నారు.మంగళవారం ఆంధ్రా–తెలంగాణ సరిహద్దులోగల కొత్తవంతెన వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ద్విచక్రవాహనాలు నడుపుతూ వచ్చిన మైనర్లను ఒకదగ్గరకు చేర్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు బండ్లు ఇవ్వడంతో వారు చెడుత్రోవ పట్టి దుష్ట సహవాసాలు చేస్తున్నారని విధిగా ఎదిగిన పిల్లలు ఏదారిలో వెళుతున్నారో తల్లిదండ్రులు గమనించాలని పేర్కొన్నారు.



మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

'పీఎం విశ్వకర్మయోజన'ను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రధాన మంత్రి విశ్వకర్మయోజన పథకాన్ని లబ్ధిదారులు సక్రమంగా ఉపయోగించుకోవాలని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారీ గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో జరుగుతున్న విశ్వకర్మ శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలోని పేదల కోసం పీఎం విశ్వకర్మ యోజన కింద 18రకాల చేతి వృత్తులవారికి అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ యోజన అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శ్యాం, భరత్, నవీన్, పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో వసంతోత్సవం



వసంతోత్సవంలో ఆలయ చైర్మన్ విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

నిడమనూరు : మండలంలోని ముప్పారంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల చివరి రోజు చక్రస్నానం, వసంతోత్సవం ఆడారు. పౌర్ణమి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు కాబట్టి ఆలయంలో రంగులు(వసంతం) చల్లుకుని శుభాకాంక్షలు చెప్పుకోవడం సంప్రదాయం, బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం హోమం, బలిహరణం, పూర్ణాహుతి, ద్వజపటుధ్వాసన, మూగబలి, దేవతా ఉద్వాసన, ఏకంత సేవలు, స్వామి వారిని ఊరేగింపుగా గ్రామంలోని చిన్న గంగా ప్రవేశం చేయించారు. యజ్ఞాచార్యులు ప్రతాపురం మత్స్యగిరి స్వామి, అర్చకులుప్రతాపురం వెంకటాచార్యులు, ప్రతాపురం రామాచార్యులుల నేతృత్వంలో పూజలు, హోమాలు జరిగాయి. కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యడవెల్లి విజయ్‌కుమార్ రెడ్డి, ఈఓ నవీన్, మెంబర్స్ సత్యనారాయణ, మర్రి శ్రీను, తాడూరి ల్మోయ్య, నాగమ్మ, ఇంకా చర్క శ్రీను స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

వేములపల్లి : మండలంలోని సల్కునూరు గ్రామంలోని స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం ఉదయం వేదపండితులు కారంపూడి అంనతచార్యుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్వామివారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు గణేష్ యూత్ సభ్యులు అల్పాహారాన్ని ఏర్పాటుచేశారు. అదేవిధంగా నీలా భిక్షమయ్య జ్ఞాపకార్థంగా ఆయన భార్య పాండారమ్మ, కుమారుడు నీలా సత్యనారాయణలు అన్నదానాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారిని గ్రామంలోని పలు వీధుల్లో భక్తులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, ఎంపీపీ పుట్టల సునీత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న మద్దిలేటి

దేవరకొండ : ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎంజీయూ ఎన్ఎస్ఎస్ సెల్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి అన్నారు. దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు దేవరకొండ మండల పరిధిలోని వెంకట్‌తండా, చందంపేట మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం మంగళవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రత్యేక శిబిరాల్లో పాల్గొని సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆయన కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవితో కలిసి వలంటీర్లకు ప్రశంసపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు మకట్‌లాల్, ఆరీఫా పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయక దేవాలయంలో రుద్రహోమం



రుద్రహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని విద్యానగర్‌లో గల శ్రీ సిద్ధి బుద్ధి సమేత శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగానే దేవాలయంలో మంటప పూజలు, లక్ష్మీగణపతి పూజలు, రుద్ర హోమాలను వేదపండితుల మంత్రోత్సవాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. అదే విధంగా బుధవారం ఉదయం 11గంటలకు శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి కల్యాణ మహోత్సం నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ఈ వినాయక సేవా సంస్థ అధ్యక్షులు కాటేపల్లి నర్సింహమూర్తి, ప్రధాన కార్యదర్శి పులి కృష్ణమూర్తి, స్వయంపాకుల విశ్వనాథ ప్రసాద్, విశ్వనాథ శాస్త్రీ, హరిరామ శర్మ, పుల్లంభట్ల లక్ష్మినారాయణశర్మ, వారణాసి ఇంజనేయులు, సూలూరి శివ సుబ్రమాణ్యం, కాటేపల్లి కృష్ణమోహన్‌శర్మ, శ్రీనివాస శర్మ, హరి సత్యనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేవాలయాల అభివృద్ధి

వేములపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డితోనే రాష్ట్రంలోని దేవాలయాలు అభివృద్ధి చెందుతాయని తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆమనగల్లు గ్రామంలోని శ్రీ పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన మాట్లాడారు. రామలింగేశ్వరస్వామివారి ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ దేశబోయిన రవికుమార్, ఆలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు బయ్య సైదులు, కాంగ్రెస్ జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు పత్తిపాటి స్వరాజ్యలక్ష్మీ, మండల నాయకులు పిల్లల సందీప్, కోల పెదసైదులు, అబ్రహం, సైదులు, కృష్ణయ్య, నగేష్, సతీష్, లింగారెడ్డి, కవిరాజు పాల్గొన్నారు.

నేత్రదానం.. మహాదానం

మాడుగులపల్లి : నేత్రదానం.. మహాదానమని డైమండ్ నేత్ర నిధి అధ్యక్షుడు మాశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెరువుపల్లి గ్రామానికి చెందిన చారుగుండ్ల బాలనర్సయ్య మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు మంగళవారం వాసవీ క్లబ్ గవర్నర్ కమలాకర్ సహకారంతో డైమండ్ నేత్ర నిధికి అందజేశారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను వాసవీ క్లబ్ రీజియన్ ప్రతినిధి మిట్టపల్లి విజయభాస్కర్‌రావు, సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఐ టెక్నీషియన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ ఫీజును తగ్గించాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : టెట్‌కు ఫీజులను తగ్గించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని టెట్ కన్వీనర్ రాధారెడ్డిని ఆమె ఛాంబర్స్‌లో కలిసి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నిరుద్యోగుల ఇబ్బందులను గుర్తించి పెంచిన టెట్ ఫీజును తగ్గించి పేద నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర నేత రవి కిరణ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర నేత గుంటి మహేశ్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిదారులపై ఉక్కుపాదం

- మిర్యాలగూడ మున్సిపాలిటీలో పలు దుకాణాలకు తాళం



నాగేంద్ర ఐటీఐకి తాళం వేస్తున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్: ఆస్తి పన్ను బకాయిదారులపై మిర్యాలగూడ మున్సిపాలిటీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ(చింతపల్లి రోడ్డు)లో గల నాగేంద్ర పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ) ఆస్తి పన్ను బకాయి చెల్లించకపోవడంతో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్ ఆధ్వర్యంలో అధికారులు నాగేంద్ర ఐటీఐకి తాళం వేశారు. అదేవిధంగా పట్టణంలోని ఇస్లాంపురంలోని ఎక్బాల్ బేగం కాంప్లెక్స్‌లోని 9 షట్టర్లకు సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో తాళాలు వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. అధిక మొత్తంలో ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో సీజ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాత బకాయిల వడ్డీపై 90శాతం రాయితీ కల్పించిందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఈ రాయితీ ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఆర్ఓ కళ్యాణి, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాకేష్‌కుమార్, రవి, బిల్ కలెక్టర్లు యాదగిరి, ఖలీల్, భిక్షం, రమేష్, ఎల్లయ్య, సురేష్, సిబ్బంది సైదులు, శ్రీను తదితరులున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ : మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వేసవిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత మున్సిపల్ అధికారులు ఆయా వార్డుల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఈ సమావేశంలో చొల్లేటి భాస్కరాచారి, రాచమళ్ల నాగయ్య, గెలమోని యాదయ్య, పున్న శ్రీనివాస్, పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం



మున్సిపల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

హాలియా : హాలియా మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమా నరేందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పిల్లి చంద్రకళ ఆంజేయులును మంగళవారం వారి నివాసంలో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసిశారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ చైర్మన్ పాండు రంగారెడ్డి హాలియా మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమా నరేందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పిల్లి చంద్రకళను శాలువాతో ఘనంగా సత్కరించి స్వీట్లు తినిపించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, తిరుమలనాథ గుడి మాజీ చైర్మన్ బుర్రి రాంరెడ్డి, నాయకులు చంద్రశేఖర్ యాదవ్, షేక్ ముస్తాఫా, కుస్‌రెడ్డి సంతోష్‌రెడ్డి, గజ్జెల శివానందరెడ్డి, ఇస్రం లింగస్వామి, గడ్డం సజ్జన్, నెమలి శ్రీధర్‌రెడ్డి, పాతనబోయిన కోటేష్, నితిన్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ తల్లికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాదిల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు రమావత్ బాలునాయక్, నాగునాయక్, బండి నాగేశ్వర్‌రావు, పసుపులేటి అజయ్, సతీష్‌రెడ్డి, మెతీలాల్, ముసలయ్య తదితరులున్నారు.

భద్రకాళి అమ్మవారికి బోనాలు

వేములపల్లి : మండలంలోని ఆమనగల్లు గ్రామంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి జాతర మంగళవారం తెల్లవారుజామున స్వామివారి అగ్నిగుండాల ప్రవేశంతో ముగిసింది. ఈ సందర్భంగా శివసత్తుల, పోతురాజుల విన్యాసాలతో మహిళలు ఊరేగింపుగా బోనాలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. బోనాలను తీసుకొచ్చిన మహిళలకు దేవాలయ చైర్మన్ వెంకటేశ్వర్లు అశోకకుమారి దంపతులు చీరలు పంపిణీ చేశారు. సందీప్, మాజీ సర్పంచ్ ఝాన్సీప్రవీణ్, ధర్మకర్తలు కలమ్మ, జోజి, వెంకన్న, భిక్షం, యుగంధర్ పాల్గొన్నారు.



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు